క్లుప్తంగా

విద్యుత్ సరాఫరాలో అంతరాయం రేపు

సాలూరు: పట్టణం, మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ గోపాలరావునాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్, సాలూరు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ బాగువలస ఫీడర్, సాలూరు టౌన్-1 ఫీడర్ మరమ్మతులు, లైన్‌కు దగ్గరగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించడం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అందువల్ల శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఫీడర్ల పరిధిలో పట్టణం, మండలంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురంటౌన్: విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒ.గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు కొత్తవలస సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ వర్క్ కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు కొత్త బెలగాం, సాయినగర్ కాలనీ, కొత్తవలస, బంగారమ్మ కాలనీ, పలు కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



కలువ పువ్వులతో అయ్యప్ప స్వామికి పూజ చేస్తున్న భక్తులు

మక్కువ: స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం వేద పండితుడు ఆరవెల్లి విజయకుమార్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున అయ్యప్పస్వామికి 1008 కలువపువ్వులతో ప్రత్యేక అర్చన చేశారు. అలాగే ప్రత్యేక అభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతాన్ని జరిపించారు. సాయంత్రం మెట్లపై పడిపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుస్వామి కాళహస్తి శ్రీనివాసరావు స్వామివారికి ప్రత్యేక కలశ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. భజన కార్యక్రమం, అన్న సమారాధన జరిపించారు.

మక్కువలో చైల్డ్ లేబర్ డ్రైవ్



మక్కువలో చైల్డ్ లేబర్ డ్రైవ్ చేపడుతున్న పోలీసులు

మక్కువ: చైల్డ్ లేబర్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మక్కువలో పలు దుకాణాల వద్ద చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ లేబర్, పోలీసుశాఖల ఆధ్వర్యంలో డ్రైవ్ చేపట్టారు. బాలలను పనిలో పెట్టొద్దని యజమానులకు సూచించారు. లేబర్ ఆఫీసర్ ఎ.సుందరరావు, పార్వతీపురం మహిళా పోలీస్ స్టేషన్ హెచ్‌సీ లావణ్య, సీఎస్‌డబ్ల్యూ అచ్యుతరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి...



నిరాహార దీక్షలు చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల

సీతంపేట: గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ఐటీడీఏ ముఖద్వారం వద్ద శాంతియుత రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బిడ్డిక గణేష్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో కొంతకాలంగా గెస్ట్ టీచర్లు, పార్ట్ టైమ్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నామన్నారు. జీతాలు పెరగడం లేదని.. పీఆర్‌సీ వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో 2014 నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను రెగ్యులర్ చేశారని చెప్పారు. 2006 నుంచి పనిచేస్తున్న గురుకులం ఉపాధ్యాయులకు మాత్రం మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేయాలని లేనిపక్షంలో సీఆర్‌టీలుగా మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. డీఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించాలని.. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘ జిల్లా జేఏసీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావుతో పాటు నాయకులు ఎస్.చిరంజీవి, బి.ఉమామహేశ్వరరావు, బి.రామ్మోహనరావు, కె.భాస్కరరావు, హరిబాబు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.ధర్మారావు, మోహనరావు, భవానీ, సీతంపేట, పెద్దమడి, మల్లి, తదితర పాఠశాలల నుంచి ఔట్‌సోర్సింగ్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఈ ఏడాదికి ఒక్కటే సిలిండర్..!

- వచ్చే మార్చి వరకూ ఇదే సర్దుబాటు
- ఏడాదికి మూడు సిలిండర్ల హామీ తుస్
- ఆధార్, రేషన్‌కార్డులకు లింకైతేనే అర్హులు
- ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు



గ్యాస్ సిలిండర్ల వ్యాన్

బలిజిపేట: పేద, మధ్య తరగతి కుటుంబాలకు గ్యాస్ సిలిండర్ భారం తగ్గిస్తాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో పేదలకు ఒకే సిలిండర్‌కు పరిమితం చేసింది. దీపావళి పండగను పురస్కరించుకుని అమలులోకి తెచ్చిన ఉచిత గ్యాస్ పథకం ఆదిలోనే అటకెక్కిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి మూడుకాదు వచ్చే ఏడాది మార్చి వరకూ ఒకే సిలిండర్ అందించనున్నారు. అక్టోబరు 29నుంచి 2025 మార్చి 31వరకు తొలి గ్యాస్ సిలిండర్ కోసం బుక్‌చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన మరో రెండు సిలిండర్ల సంగతేంటని వినియోగదారులు బుర్రలు పీక్కుంటున్నారు. బలిజిపేట మండలంలో తెల్ల రేషన్‌కార్డుదారులు 19,370మంది ఉన్నారు. మండలంలో గ్యాస్ కనెక్షన్లు ఉన్నవారు 13,815మంది. వాటిలో డొమెస్టిక్ 2,476, డబుల్ గ్యాస్ కనెక్షన్లు 2,449, ఉజ్వల 3,503, దీపం 4,097, బీపీఎల్ 1,290మంది ఉన్నారు.

తప్పని ఈకేవైసీ తిప్పలు

ఉచిత గ్యాస్ సిలిండర్ పొందాలంటే అనేక ఆంక్షలు అమలులోకి తెచ్చారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అంకౌంట్‌కు సెల్‌ఫోన్ నంబర్ లింక్, గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ తప్పనిసరి చేశారు. వీటిలో ఏ ఒక్కటి వ్యత్యాసమున్నా నగదు జమకాదు. అధికారంలోకి వచ్చిన తరువాత ఉచితగ్యాస్ పథకానికి కొత్త మెలికలు పెట్టడంతో ఇదేం బాధరా బాబు అని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కనెక్షన్‌తో పాటు బియ్యం కార్డు ఉంటేనే పథకం వర్తిస్తుందని, ముందు నగదు చెల్లించే పద్ధతి బాగోలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికి ఇంకా ఈకేవైసీ అవని బాధితులు గ్యాస్ ఏజెన్సీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్షర జ్ఞానం లేని మహిళలు గతంలో ఏవో సెల్‌ఫోన్ల నంబర్లు ఇచ్చేశారు. అవి ఇప్పుడు వారివద్ద లేకపోవడంతో గందరగోళం చెందుతున్నారు.

గ్రంథాలయాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: గ్రంథాలయాల ప్రాముఖ్యత, ఆవశ్యకత విద్యార్థులకు తెలియచేయాల్సిన అవసరం ఉందని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బలిజిపేటలోని గ్రంథాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాధాన్యం, ఆవశ్యకత తెలియపరచాలని, ప్రతి పాఠశాలలో గ్రంథాలయాల్లో లాగానే మంచి మంచి కథల పుస్తకాలను ఉంచి వాటిని చదివించాలని సూచించారు. చిన్నతనం నుంచి గ్రంథాలయానికి వెళ్లి మంచి, మంచి పుస్తకాలను పఠనం చేసేవిధంగా వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రాజగోపాల్, బలిజిపేట ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

పార్వతీపురంటౌన్: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగవంశం శంకర్రావు, సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు గొర్లి వెంకటరమణలు కోరారు. ఈ మేరకు బుధవారం వారు కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు రాత్రి వేళల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్న 8 మందికి. ఏరకమైన రక్షణ లేదని, అలా 8 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. 9 మంది చేసేవారని, అందులో ఒకరు చనిపోయారని, 9 మంది చేసే పనిని 8 మంది చేత చేయిస్తున్నారని, వారికి పనిభారం పెరిగిందన్నారు. రాత్రిపూట పనిచేయడం వలన వాహనాల వల్ల ప్రమాదం ఉందని, పండగపూట కూడా సెలవులు లేవని, కావున వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పగటిపూట పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులైన 11 మందికి 2024 జనవరి నెల జీతం ఇవ్వాలని, ఆదివారం సెలవు ఇవ్వాలని, సమ్మె కాలం జీతం, సీఎల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, కార్మికులు సీఐటీయూ పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సంచాన ఉమ, పాకల సన్యాసిరావు పాల్గొన్నారు.

సీఆర్‌టీలుగా గుర్తించాలి



ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక దివాకర్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15-20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో గిరిజన విద్యార్థులకు 24 గంటలు విద్యాబోధన చేస్తున్నామని, తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ పోస్టులకు డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. నిరసన దీక్షలకు మద్దతు, సంఘీభావం తెలిపిన గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులవి న్యాయమైన డిమాండ్స్ అని వాటిని తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం, విద్యా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరసాడ రమేష్, సహాయ కార్యదర్శి రాయల వెంకట్, లక్ష్మి, జ్యోతి, మీనా, రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నివాసానికి రెండు సెంట్లు ఇవ్వాలి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పార్వతీపురంటౌన్: పేదలకు నివాసానికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని 7వార్డు సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలు అనేక మంది ఉన్నారని, ఎక్కువ వార్డుల్లో ఒక్కో ఇంట్లో రెండు మూడు కుటుంబాలు కష్టంతో మెసలుతున్నాయన్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి పట్టణాల్లో ఉన్న పేదలందరూ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేకమార్లు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు చేసి ఇచ్చేంతవరకు వివిధ దశల్లో ప్రజాపోరాటం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిరుపేద మహిళలు పాల్గొన్నారు.

మద్యం షాపుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న సీఐ డి.పద్మావతి

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి, బలిజిపేట, సీతానగరం మండలాల్లో బుధవారం సిబ్బందితో కలిసి మద్యం షాపులను తనిఖీ చేసినట్లు సీఐ డిపద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గరుగుబిల్లి మండలంలోని రావివలస, ఉల్లిభద్ర, గరుగుబిల్లి, సీతానగరం మండలంలోని బూర్జలో 1, 2 మద్యం షాపులను తనిఖీ చేసి సరుకు నిల్వలు రికార్డులు, సేకరణ రికార్డులను పరిశీలించామన్నారు. స్టాక్ రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నామని తెలియజేశారు. అలాగే మద్యం సీసాలపై ఉన్న ధరకే విక్రయాలు చేయాలని అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించినట్లు తెలియజేశారు. మద్యం విక్రయాలపై ఎటువంటి సమస్యలున్నా ఫోన్ 9449023773నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.


బాలల హక్కులపై అవగాహన అవసరం



లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరికీ బాలల హక్కులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు బెలగాంలోని ఎంజేపీ. స్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని, బాలలు ఆర్థిక, సామాజికపరంగా న్యాయం పొందేందుకు చట్టాలపై అవగాహన అవసరమని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.రాఘవేంద్ర, ఎం.వెంకటరమణ, ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తుకు పద్ధతులు పాటించాలి



'పొలంపిలుస్తోంది'లో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు

బలిజిపేట: మొక్కజొన్న విత్తే సమయంలో పద్ధతులు పాటించి విత్తడం వల్ల మంచి దిగుబడులు వస్తాయని ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెద్దింపేట, నారాయణపురం గ్రామాల్లో బుధవారం 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి మాగాణీల్లో మొక్కజొన్న సాగును పరిశీలించి తగు సూచనలు అందించారు. ఇటీవల కాలంలో దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగుపద్ధతి చేస్తున్నారన్నారు. ఈ సాగు నవంబర్ నుంచి జనవరి మొదటి వారం వరకు మాత్రమే అనుసరించాలని సూచించారు. ఆ తరువాత విత్తడం వల్ల దిగుబడి తగ్గుతుందని, అటువంటప్పుడు తాడు పద్ధతిలో విత్తుకోవాలని చెప్పారు. వరుసకు, వరుసకు మధ్య 60సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 20సెంటీమీటర్లు ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా 30రోజుల మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గుర్తించి దాని నివారణకు తగు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఉచితమైతే పెత్తనమెందుకు?

సీతానగరం: ప్రభుత్వ పాలకులు ఇసుక ఉచితమన్నారు.అధికారుల పర్యవేక్షణ ఎందుకని, అడుగడుగునా రశీదులు ఏవంటూ క్రాస్‌చెకింగ్ చేయడంతో నిర్దేశించిన సమయానికి చేరుకోలేక పోతున్నామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం మండలంలోని సువర్ణముఖినదిపై బూర్జ, పెదభోగిలి రేవులనుంచి నాటుబండ్లు, ట్రాక్టర్ల సాయంతో ఉచితంగా ఇళ్ల లబ్ధిదారులు ఇసుక తరలించుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.ఈ మేరకు భవన నిర్మాణం చేపడుతున్న వారు ఇసుక తరలిస్తున్నారు. సీతానగరం మండలంలో నిర్దేశించిన రేవులైన లక్ష్మీపురం, సీతానగరం బిడ్డి రేవు నుంచి, బూర్జ 'ఎ' రేవు నుంచి ఇసుక తరలిస్తున్నారు. అయితే ఇసుక తరలిస్తున్న నాటుబండ్లు, ట్రాక్టర్ల డ్రైవర్లు రశీదులు పొందాలని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర సచివాలయ ఉద్యోగులు షిఫ్టుల పద్ధతిన రాత్రింబవళ్లు రేవులో ఎందుకు కాపలా కాయాల్సి వస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఇసుక తరలించే లబ్ధిదారులు రశీదుల కోసం, ఓటీపీ నంబర్ వచ్చినంతవరకూ గంటల తరబడి ఉండాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నదిలో ఇసుక కొరత ఎక్కువగా ఉన్నందున నీరు ప్రవహించే ప్రాంతంలో గోతులు తీసి ఇసుక లోడ్ చేయాల్సి వస్తోంది. రీచ్‌లలో గోతులు పడడం వల్ల పొలాలకు వెళ్తున్న సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు, కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ నేరాల నివారణకు సహకరించాలి



కృష్ణారాయపురంలో మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: గ్రామ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం నిరోధించడానికి ప్రజలు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని కృష్ణారాయపురంలో బుధవారం సైబర్‌నేరాల నివారణ, మాదకద్రవ్యాలు నిరోధించడంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రాణాంతకమైన మాదకద్రవ్యాలను నిరోధించడానికి, వాటివల్ల వచ్చే అరోగ్యపరమైన సమస్యలను తెలియజేస్తున్నామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాల్లో వాహన చోదకులతో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనుభవం లేకుండా కార్లు, మోటార్ వాహనాలు డ్రైవింగ్ చేయడం, మద్యం తాగడం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు, సీట్ బెల్ట్ లేకుండా కార్లు రోడ్డుపై నడుపుతున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తులు తప్పనిసరిగా సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించాలని, ఆటోలు నిర్దేశించిన ప్రయాణికులతో నడపాలని కోరారు. ఎటువంటి సంఘటనలు జరిగినా ప్రజలు 1930కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో ఇప్పటివరకూ ఉన్న జాబ్ కార్డులను ఉపాధి వేతన దారులు ఆన్‌లైన్ ద్వారా రెన్యువల్ చేయించు కోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో గల ఎన్ఆర్ఈజీఎస్ భవనంలో ఏపీఓ భాను అధ్యక్షతన టెక్నికల్, క్షేత్ర సహాయకులతో జాబ్‌కార్డుల విషయమై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇప్పటివరకూ జాబ్‌కార్డులు కలిగి ఉన్న వేతనదారులందరూ రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. అలాగే కొత్తగా జాబ్‌కార్డులు కావాల్సిన వారిలో అర్హులందరికీ కొత్తకార్డులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులతో మంజూరుచేసిన గ్రామీణాభివృద్ధి పనులు నిర్వాహకులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. కొత్తగా జాబ్‌కార్డులు కావాలిసిన వారి జాబితాలను క్షేత్ర సహాయకులు సిద్ధ చేయాలని చెప్పారు. అలాగే వేతనదారులంతా గ్రామాల్లో ఉన్న పోస్టాఫీసుల్లో ఎస్‌బీ అకౌంట్లు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈజీఎస్ జేఈ కృష్ణ, టెక్నికల్ సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి మంచి నిర్ణయాలు తీసుకోవాలి

- ఏఎస్పీ అంకిత సురానా



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ అంకిత సురానా

పార్వతీపురంటౌన్: విద్యార్థి దశ నుంచి మంచి నిర్ణయాలు తీసుకోవాలని ఏఎస్పీ అంకిత సురానా అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలాలలో బధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మంచి నిర్ణయాలు జీవితంలో తీసుకోవాలని, విద్యార్థి దశనుంచే బాలల హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. భవిష్యత్తుకు సంబంధించిన లక్ష్యాలను నిర్ణయించుకుని ఆ విధంగా చదవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, గురువులకు పేరు తీసుకు వచ్చేలా ప్రవర్తించాలని, విద్యార్థులకు హక్కులు వాటి విషయంలో భంగం కలిగితే పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదిస్తే సహకరిస్తుందని తెలిపారు. 'జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాణి మాట్లాడుతూ ఇతరుల ప్రవర్తనను బట్టి గుడ్‌టచ్ లేక బేడ్ టచ్‌ను పిల్లలు తెలుసుకుని, ఈ విషయాన్ని నమ్మకం ఉన్న వారికి, తల్లిదండ్రులు తెలియజేయాలని సూచించారు. ఆరోగ్యం పరిశుభ్రతపై శ్రద్ధ చూపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా చిల్డ్రన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎ.సత్యనారాయణ, విద్యార్థులు, సిబ్బంది హాజరయ్యారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని ఐటీడీఏప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జన్ జాతీయ గౌరవ దివస్ 2024 కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలను బుధవారం నిర్వహించారు. పార్వతీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ప్రారంభించారు. వాలీబాల్, జావెలిన్ త్రో, అర్చరీ, డ్రాయింగ్, డిబేట్, వ్యాసరచనలలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం విద్యార్జన పట్లనే కాకుండా విద్యార్థులు క్రీడల్లో విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్.తిరుపతి నాయుడు, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాస్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు .